# ముసుగు నాగమ్మ మహిడీ

చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత అంటారు. బుద్ధి మాలిన పనిచేసినప్పుడు, ఫలితాన్ని అనుభవించక తప్పదు. ఆ బుద్ధి మాలిన పనిచేసినవాణ్ణి నేనైనా సరే, ఇతరులు నాపట్ల సానుభూతి చూపెట్టవలసిన అవసరం లేదన్న షరతు పైన్నే నేను నా సోదినంతా వెళ్ళబోసుకుంటున్నాను.

మానవుడు మొన్న పుట్టి నిన్న కళ్ళుతెరచిన వాడేమీకాదు; కొన్ని వేలసంవత్సరాల చరిత్రకు వారసుడు. ఈ సుదీర్ఘ చరిత్రలోని ముప్పాతికా మువ్వీసంవంతు కాలంలో అతడు తనకంటూ కొంత స్థిరాస్తులు, చరాస్తులు వుండాలన్నపట్టింపు పెట్టుకున్నవాడు కాదు. ఒక తలచాటు సంగతే తీసుకోండి! కొండగుహల్లో వున్నాడు. నిక్షేపంగా అలాగే కాలం వెళ్ళబుచ్చి వుండొచ్చు. నాలుగు గోడలతో గూడిన పైకప్పుతో తనకొక నివాసగృహం వుండి తీరాలన్న అత్యాశ అతడికి కలిగి వుండగూడదని నా అభిప్రాయం. కలిగిందిపో, అందుకు స్తోమతవున్న వాళ్ళకైతే మంచిదేగానీ, నాబోటి లాకాయి లూకాయి గాళ్ళకు మట్టుకు కలిగి వుండగూడదని నేను త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నాను.

ఈ స్వంతయింటి సంకల్పం గూడా ఏ అడవిలో పల్లెకో, ఆయుధాల దిబ్బకో పరిమితమైవుంటే ఆ సంగతి వేరు. మునిసిపాలిటిగా వుండీ వుండీ, ఇక మీదట ఏ సుముహూర్తాన్నో హఠాత్తుగా కార్పొరేషనుగా మారిపోనున్న ఒక భావికాలపు మహానగరంలో స్వంతయింటి కోసం నేను అర్రులు సాచడం పెద్ద పొరబాటు. ఆలూ చూలూ లేకపోయినా సోమలింగం గురించి కలవరించినట్టు, నేను పేవ్‌మెంటు పైన నడుస్తూ రోడ్డుకిరువైపులావున్న వాటిలో మనకే యిల్లయితే బాగుండునో అని విచికిత్స చేస్తూవచ్చాను. దీనిల్లు బంగారం గానూ, ఒక యింటిని చూచిన కంటితో మరొక యింటిని చూడ్డం సాధ్యమయ్యేది గాదు. ఉద్యోగంలో చేరిన కొత్త. నెలపుట్టగానే నాలుగు రూకలు కళ్ళ బడేవేమో, ఆకాశానికి మూడేబారలన్నంత ఉత్సాహం మనసులో ఉరకలు వేస్తుండేది. అంతఃపుర స్త్రీల దగ్గర ఉత్తరకుమారుడు 'కుంభజన్ముడెంత, కురుపితామహుడెంత, కౌరవేంద్రుడెంత, కర్ణుడెంత' అంటూ సొరకాయలు కోయలేదా? సరిగ్గా నేను గూడా 'శ్రీపురం ఎంత? శాంతినగర్ ఎంత? దళవాయి కాలనీ ఎంత? ఖిల్లామహల్ ఏరియా ఎంత?' అనుకునేవాణ్ణి. ఏది ఎంతెంతో కాలక్రమాన తెలిసొచ్చింది. పాతికేళ్ళ నాడు నాలో బుద్ధిపుట్టిన నాటికి గ్రౌండు (60'×40') ధర పదిహేను వేలకు దరిదాపుల్లో వుండేది. ఇంకొక పదేళ్ళు గడిచేసరికి అంకణం (36చ.అ.) అయిదు వందలే నన్నారు. మళ్ళీ పదేళ్ళు గడిచాక వాకబుచేస్తే చదరపు అడుగు ముప్పైరూపాయల కొచ్చేసినట్టు తెలిసింది. కాలగతికి గ్రౌండుధర ఏ అనుపాతంలో పెరుగుతుందో గ్రహించడానికి నేను గణితశాస్త్రంలో కొంత మల్లగుల్లాలు పడవలసి వచ్చింది. ఫరవాలేదు. ఒక అనుభవాన్ని గడించడానికి ఎంత శ్రమైనా పడొచ్చు. నా అనుభవం వల్ల నేను మన సమాజంలోని సగటు ఉద్యోగి ఆశల్ని, ఆశయాల్ని వాస్తవ పరిస్థితులెంతగా అపహాస్యం చేస్తున్నాయో తెలుసుకున్నాను. అయ్యా గొర్రె తోకంతా ఎంత? జాన, లేక బెత్తెడు మాత్రం. ఇలా

నేను నా స్తోమత గుర్తించినవాడినై, నగర శివార్లలో అప్పటికప్పుడే కబంధుడిలా బారలు చాస్తున్న విఠోభా నగరుకు పరుగెత్తి, అక్కడైనా చచ్చి సేయంగల విన్నపాలతో ఒక యింటి జాగా కొని, స్వంతం చేసుకోగలిగాను. ఎవరో ఒక పుణ్యాత్ముడు స్థూపం లాంటి ఎత్తయిన అరుగు పైన తులసికోట లాంటి మండపం నిర్మించి, అందులో పాండు రంగడి విగ్రహం ప్రతిష్ఠించాడు. అంతటితో ఆ ప్రాంతంలో చెల్లాచెదురుగా పడి వుండిన కొన్ని యిళ్ళకు విఠోభా నగరన్న పేరొచ్చేసింది. చరమ జీవితానికి నేనక్కడ ఓ ఉనికిపట్టును సంపాదించుకునేటప్పటికి వీధులతో, సందు గొందులతో, మురికినీటి స్థావరాలతో, ఎలక్ట్రిక్ స్తంభాలతో, ఊరకుక్కలతో, బిచ్చగాళ్ళతో విఠోభా నగర్ తన సహజ రూపాన్ని తాను సంతరించుకుంటోంది. ప్రభుత్వ హితవును పాటించి, కుటుంబ శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చి నేను జాగ్రత్తగా పొదుపుచేసి దాచుకుంటూ వచ్చిన మూలధనం ఇంటి జాగా కొనడానికి సరిపోయింది. యల్.ఐ.సి.లో అప్పుచేసి పునాది గోడలు లేపేశాను. నేలనుంచి మూడడుగులు పైకిలేచిన పునాది గోడల నిండుగా యిసుక పోయించాను. ముందర కొంచెం ఖాళీ జాగా, ఆరడుగులతో వసారా, పదడుగుల వెడల్పుతో ఓ లివింగ్‌రూము, పదిహేనడుగులతో పెద్ద హాలు, ఆ వెనుక కిచెను, బాత్‌రూము - యిలా సర్వలక్షణ సమన్వితంగా యింటిని ప్లాను చేశాను. ఇటుకలు తోలించి, గోడలు పెట్టించి, ఏక్ ధమ్మున మోల్డింగ్ దాకా లాక్కొచ్చేయాలనుకున్నాను. అయితే అనుకున్న దొకటి, అయింది మరొకటి. శివపూజలోకి ఎలుగుబంటి జొరబడినట్టయింది. నా పాలిటికి పిట్టపిడుగులా ఒక మహానుభావుడు ఊడిపడ్డాడు.

"చాల్చాలు లేవయ్యా! దినం మంచిదని ముందటికెవుడో పగలే దొంగ తనానికి జొరబడి నాడంట! ఆరునెల్లు నేను వూళ్లో లేకపోయేటప్పటికి నువ్వింత పని జేస్తావా? నీ కడగాలు (పునాది) పదడుగులు దాకా నా జాగాలో కొచ్చేసింది గదయ్యా! మంచి మాటల్తో తీసేస్తివో సరేసరి. నేనే చెయ్యి చేసుకోవలసి వస్తే, కడగాలంతా లేపి పారేస్తాను" అంటూ అతడు పుర్రించాడు.

"అయ్యో, కాదండీ! నేనీ గ్రౌండు పావురాల సుబ్బరాజు దగ్గర కొనుక్కున్నా. రిజిష్టరు చేయించుకున్న కొనుగోలు పత్రాలు నా దగ్గరున్నాయి. పకడ్బందీగా చెక్కుబందీ వివరాలు రాయించాను. ఉత్తరం : వీధి; దక్షిణం: కనుపర్తి రామలింగం గారి సామిల్లు; తూర్పున ముత్యాల రత్తమ్మ గారి ఖాళీ జాగా...."

"ఉండుండు...." పోట్లగిత్తలా అతడు అడ్డు తగిలాడు. "ఆ ముత్యాల రత్తమ్మ ఎవరనుకొంటివి? నా మేనత్తే. ముండ, బిడ్డలు లేకుండా సచ్చింది. దానికి తలకొరివి పెట్టింది నేనే. సావడానికి ముందు ఇల్లు, నేలా నట్రా అంతా నా పేరిటకు రాసి యేలిముద్దరేసి పోయింది. దానికిక్కడ ఖచ్చితంగా అయిదు సెంట్ల జాగా వుండేట్టు లెక్క. నువ్వెంత లేదన్నా అయిదడుగులో, పదడుగులో ఆ నేలలో కొచ్చేసి వుండడం ఖాయం. నా సొత్తులో ఎవుడైనా యేలు పెడితే నే నూరుకునేటోణ్ణిగాదు, ఎముకలు యిరగ్గొట్టేవాణ్ణి. నా పేరు పకీర్రాజు. పకీర్రాజంటే ఎవురో, ఏంటో తెలీకపోవచ్చు. సుట్టుపక్కల ఎవురినైనా అడిగిచూడు..."

"అయ్యా, దయచేసి మీరొక మాట వినిపించుకోవాలి. మీరొక అరగంట సేపు గనుక యిక్కడుంటే, నేనింటికి వెళ్లి కొనుగోలు పత్రాలు తెచ్చేస్తాను. ఎవరికైనా

పదిమందికి చూపిద్దాం. పత్రంలో రాసిందానికన్నా నేనొక అంగుళం మించి వచ్చినట్టు తేలినా సరే. నేను నా జాగా పునాది గోడలతో సహా మీకు వదిలేస్తాను" అంటూ నేను పరిపరివిధాలుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించాను.

"ఏమయ్యో, అక్కడికి చాలించు! పావురాల సుబ్బరాజు పత్రాలు కుంకం కట్టుకోడానికి పనికిరావు. తనకు ఏటిలో ఎయ్యెకరాలుందని ఒకడు రాసిస్తాడు. సెల్లిపోతాదా? అదంతా నాకు చెప్పొద్దు. నువ్వు నా జాగాలో కొచ్చినావు. కడగాలు తీసి కాంకిరీటు గోడ పెట్టేసినాము గదా అని మిడిసి పడొద్దు..." చిటికేస్తూ అతడు కొనసాగించాడు. "చ్ఛణం - ఒక చ్ఛణం తొవ్వి పారేస్తాను. నాచేతనౌను. నాతో పెట్టుకోవద్దు. బద్దరం జాగరత్త!"

అల్టిమేటం జారీచేసి, అప్పటికి నిజంగానే తనకేదో అపచారం జరిగిపోయి నట్టు, అందుకు ప్రతీకారం నెరవేర్చేదాకా తనకిక నిద్రాహారాలు లేనట్టు పకీర్రాజు రొప్పుతూ వెళ్ళిపోయాక నేను గాలి తీసేసిన బెలూనులా అక్కడొక అరుగుపైన కూలబడిపోయాను.

అతడేమో తనను గురించి ఇతరుల్ని అడిగి తెలుసుకోమన్నాడుగానీ నాకలాంటి అవసరమేమీ కన్పించలేదు. పులినీ, తోడేలిని మనకు ఇతరులు పరిచయం చెయ్యవలసిన అవసరం ఏముంటుంది? రూపం చూడగానే జంతువుల స్వభావం తెలిసిపోదా? పకీర్రాజు గుబురుగా గిరజాలు పెంచాడు. కొడవలి అర్ధవలయాకృతితో వంగిన మీసాల గుబురు గడ్డంలో కలిసిపోతున్నాయి మరికొంచెం వివరంగా చెప్పాలంటే- మేకప్ చెయ్యకుండా అతణ్ణి బొబ్బిలి నాటకంలో బుస్సీ వేషానికి రికమెండ్ చెయ్యొచ్చు. అతడు చెయ్యిచేసుకుంటాడోలేదో ఆ దేవుడి కెరుక, కానీ సునాయాసంగా నాలుక చివరినుంచి రువ్వుతున్న మోటుమాటలు తాకిడికి నేను జడుసుకున్నాను. వాదాన్ని మరికొంచెం పెంచితే అతడి నోట యింక బూతు మాట లొచ్చేస్తాయన్న సందర్భంలో నా నోటికి తాళం పడింది.

రాజ్యం గోల్పోయిన రాజులా, భార్యను గోల్పోయిన భర్తలా, శీలం గోల్పోయిన స్త్రీలా దిగాలుపడి కూర్చున్న నాపైన జాలిపడిపోతూ, పది పదిహేను మంది మనుషులు ఒక్కొక్కరుగా వచ్చి నా చుట్టూ మూగిపోయారు.

"మీ టైము బాగుండలేదండీ బాబుగారూ! వైకుంఠపాళీలో పాము నోట పడిపోయారు. వీడు, ఈ పకీర్రాజు ఆరునెలలుగా యిక్కడ లేనట్టుగా చెబుతున్నాడు గదా! ఏమయ్యాడో అడగరే! ఆ మధ్య మంచి నీళ్ళకుంట దగ్గర ఓ హత్య జరిగినట్టు చెప్పుకున్నారు జ్ఞాపకముందా? అది చేసింది వీడేనన్న గుమానీ వచ్చింది. అప్పుడు మాయం కావడం, ఇదిగో యిప్పుడు. మీ జాగా ప్రక్కన ఆ ముసలిదాని కెవతకో కాస్త నేల వుంది. వుండడ మిప్పుడు ప్రమాదమై పోయింది. ఇంతకూ ఆ ముసల్ది వీడికా నేల రాయించి యిచ్చి వుంటుందన్న నమ్మకమేమీ లేదు. కాదులెండి! బెదిరించి మీదగ్గర అయిదో పదో గుంజు కోవాలన్నది వాడి ప్లాన్. ఇవ్వమని మేము చెప్పం కానీ యివ్వకపోతే వాడు మిమ్మల్ని యిల్లు కట్టుకోనివ్వడని మాత్రం చెప్పగలం..."

"అయిదో, పదో అంటున్నారు. ఇచ్చేస్తే పోలా?" అన్నాను నేను.

నాచుట్టూ చేరిన వాళ్ళు ఒకరివైపొకరు చూసుకుంటూ చూపులలోనే నవ్వుకున్నారు. ఉబికివచ్చే నవ్వును ఆపుకుంటూ ఒకాయన "అయ్యా! అయిదుని,

పదిని యిక్కడ సహజ విలువల్తో గణించకూడదు. స్థాన విలువల్లోకి తీసుకోవాలి. మీకొకవేళ ఈ బెడదనుంచి బయట పడాలని అయిదువేలో, పదివేలో యివ్వడానికి సిద్ధపడ్డారే అనుకోండి! అప్పుడది పులికి మనిషి నెత్తురు రుచి చూడడమే అవుతుంది. జీవితాంతం ఈ వూబిలో నుంచి బయటపడలేరు" అంటూ మెత్తమెత్తగానే మందలించాడు.

"అయితే ఇప్పుడేం చేద్దామంటారు?" అంటూ నేను రిచ్చపడిపోయాను.

"పోనీ, ఒక మాట పోలీసులతో చెప్పి చూడండి" అంటూ ఒకాయన రహస్యంగా చెవిలో వూదాడు.

బుద్ధి భూము లేలమంటే కర్మ గాడిదల్ని కాయమంటుందట! ఇల్లు పూర్తిచేసి, గృహప్రవేశం చేయడానికి బదులుగా, నేను పోలీసు స్టేషనుకు వెళ్ళవలసి వచ్చిందంటే మరేమనుకోవాలి? కొన్ని కొన్ని చోట్ల కొందరి ఉనికి పరిహాసభాజన మవుతుందన్న విషయం నాకు పోలీసు స్టేషనులో తెలిసొచ్చింది. నాది యిటు కేడీలతో గానీ, అటు పోలీసులతో గానీ వ్యవహరించగల ముఖంలా తోచలేదేమో, అక్కడి పోలీసులు వరహీనపు పెళ్ళికొడుకును చూచినట్టుగా నావైపు చూడసాగారు. నాకెదురైన యిక్కట్టును గురించి నేను ఏకరువు పెడుతుంటే వాళ్ళు ఉప్పూ, కారం లేని చప్పిడి తిండి తింటున్నట్టు నిరుత్సాహంగా కూచున్నారు.

అయినా వీలైనంతలో నాకు న్యాయం చేకూర్చడమే తమ పరమోద్దేశం అయినట్టు "అయితే యిప్పుడు మమ్మల్నేం చేయమంటారు?" అన్నాడు హెడ్‌కానిస్టేబుల్.

"మీరెలాగైనా పకీర్రాజును అడ్డుకోవాలి" అన్నాను.

"ఏ బేసిస్ మీద అడ్డుకోవాలి? మీరతడి జాగాను దురాక్రమణ చేసినట్టు చెబుతున్నాడు గదా?"

"లేదండీ! పావురాల సుబ్బరాజు నా పేరిటకు రాసి, రిజిష్టరు చేసి యిచ్చిన కాగితాలు నా దగ్గరున్నాయి. మీకు చూపించాలని తీసుకొచ్చాను గూడా!" అన్నాను.

"అలాంటి కాగితాలు వాడి దగ్గర గూడా వుంటాయండీ! వాటిలో ఏది అసలో, ఏది నకలో తేల్చేదెవరు? ఆ పని మా జ్యూరిస్ డిక్షను కిందికి రాదే! మీరు సివిల్ కోర్టుకు వెళ్ళాల్సింది!"

"లేదండీ! పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ప్రయోజన ముంటుందని ఎవరో చెప్పారు" అంటూ నీళ్ళు నమిలాను.

"అయితే ఒక పనిచేయండి" అన్నాడు హెడ్ కానిస్టేబిలు.

"చెప్పండి" అన్నాను.

"వెళ్ళి మీ ప్లాటుకు మీరు కట్టడం పని కొనసాగించండి. వాడొస్తాడు. కట్టగలిగితే మీరు కట్టండి. లేదా దెబ్బలు తినండి. నెత్తురూ, గాయాలూ స్పష్టంగా కనిపించాలి. ఇది నెత్తురే, ఇవి గాయాలేనని డాక్టరు ఓ కాగితం రాసివ్వాలి. ఆ కాగితం జేబులో పెట్టుకుని, చక్కా యిక్కడికి రండి. అప్పుడు ఫైనలు మీ కేసు టేకప్ చేస్తాం....."

అయితే, పోలీస్‌స్టేషనుకు వెళ్ళడంలో నా ఉద్దేశం పకీర్రాజు తగాదా నివారణ కావాలన్నదే గాని, అంత ప్రవర్ధమానం కావాలని మాత్రం గాదు. పైగా, పోలీసుల

కెంతవరకు గాయాలు కావాలో అంతవరకే పక్షిరాజు నన్ననుగ్రహించ గలడన్న నమ్మకమేముంది? గాయం మరింత లోతుకు దిగినా, తల మరికొంచెం ఎక్కువగా చీలినా అప్పుడిక నా గమ్యస్థానం పోలీస్‌స్టేషను కానేరదు గదా!

పోలీస్‌స్టేషను పైన పెట్టుకున్న ఆశలన్నీ వమ్మయిపోయాక, ఎందకైనా మంచిదని, వృత్తిలో తల పండిన అనుభవజ్ఞుడు యస్.యం.సూరపరాజు, బి.ఎ.,బి.యల్. గారిని సంధించి చూచాను.

"అయ్యా, వేంకటేశ్వర్లు గారూ!" (నాపేరదేలెండి!) "చచ్చిందో బ్రతికిందో తెలియకుండా న్యాయదేవతను కలకాలం గాజు తొట్టిలో పెట్టి ప్రిజర్వు చేయగలిగింది మన సివిల్ కోర్టులే! ఒక కోర్టులో మీ కేసు నెగ్గుతుందనే అనుకుందాం. ప్రతివాది పైకోర్టుకు వెళ్ళకుండా వుండడు. మా వకీళ్ళలో గూడా నోరు పెద్దదిగా పెట్టుకుని, బిగ్గరగా అరుస్తూ కూటసాక్ష్యాలు, దొంగ పత్రాలు సృష్టించగలిగిన వాళ్ళదే రాజ్యం. బ్రతికినంత కాలం అద్దె యింట్లోనే ఉంటూ కోర్టుల చుట్టూ తిరగలేరు గదా! ఇందుకు మరొక పరిష్కారమేదైనా చూచుకోవడం మంచిది...."

ఆ 'మరొక పరిష్కారమార్గ' మేదో తలచించుకున్నా నాకు స్ఫురించక పోయింది. ఏ సమస్యనైనా సమూలంగా తుడిచి పెట్టగల మహాశక్తి కాలం. నేనా కాలాన్నే నమ్ముకుని, అడపా తడపా ఎప్పుడైనా విఠోభా నగర్ వెళ్ళి పునాదులతో ఆగిపోయిన నా యింటి కట్టడాన్ని చూచి గ్రుక్కిళ్ళు మ్రింగుతూ కాలమొక్క రీతిగా గడపసాగాను. ఇలా ఒక ఆరు మాసాలు గడిచాక నా అదృష్టం కొద్దీ గొప్ప లౌక్యుడైన పెద్దమనిషి ఒకాయన నాకు తారసిల్లి, అమోఘమైన తరుణోపాయం ఒకటి సెలవిచ్చాడు.

"వెంకటేశ్వర్లుగారూ! రెవిన్యూయిలాకా, రిజిస్ట్రేషను విభాగం, పోలీసు వ్యవస్థ, న్యాయస్థానాలు మొదలైన వాటితో గూడిన ప్రభుత్వ యంత్రాంగం వల్ల మీకు న్యాయం చేకూరదని తేలిపోయింది. ఫరవాలేదు. ప్రభుత్వమన్న పేరు లేకపోతే పోయిందిగానీ అది చేయగల – లేదా అది చేయలేని పనులు గూడా – నిరాఘాటంగా నిర్వహించగల వ్యవస్థ ఒకటి ఈ దేశంలో వుందని మీరు గుర్తించాలి. దాని నేతలు సర్వతంత్ర స్వతంత్రులు. భుజబలాన్ని, ఆయుధాల్ని నమ్మినట్టుగా వాళ్ళు రూల్సుని, రెగ్యులేషన్లని, మనుషుల్ని, మంచితనాన్ని నమ్మరు. ఈ వ్యవస్థకు నియమాలు, నిబంధనలు విధించే రాజ్యాంగ చట్టమేదీ లేదు. నయాన్నో భయాన్నో తన ప్రయోజనం నెరవేరితీరాలన్నది దాని లక్ష్యం. నిమిషాలమీద, గంటలమీద – పోనీ, ఆలస్యమైతే రోజులమీద ఏ కేసులోనైనా అమీ తుమీ తేల్చుకోవడం దీని పాలసీ. మీరు దీన్ని శరణు జొచ్చి ఉన్నట్టయితే, ఈ పాటికెప్పుడో స్వంత ఇంట్లో ఉండి ఉండొచ్చు...."

ఆయన మాటలు వింటుంటే నాలో అడుగంటిన ఆశ మళ్ళీ కొనలు సాచి, ననలు తొడిగినట్టయింది. "బాబూ! చాలా తేంక్సండీ! మీరు చెప్పే దాకా యిలాంటి దొకటుందని నాకు తెలియదు. మీ మేలు నేనే జన్మలో మరిచిపోను. మీరిందాకా 'ఒక వ్యవస్థ' అన్నారే, అదెలాటిదైనా దాన్ని నడిపించే కార్యదక్షులెవరో తెలియజేయండి. వాళ్ళకు నా యిబ్బందిని నివేదించుకునే పద్ధతి గూడా సెలవివ్వండి" అని ప్రాధేయపడ్డాను.

ఆయన సాకల్యంగా అన్ని వివరాలు నా చెవిలో వేసి "వెళ్ళి రండిసార్! మీకు శుభమగును గాక!" అంటూ దీవెనలు గూడా అందజేశాడు.

నగరంలో ఆ ప్రాంతానికి డొంకల దొరువు అని పేరెలా వచ్చిందో నాకు తెలియదు. దాదాపు ముప్ఫైయేళ్ళుగా నేనిదే టౌనులో నివసిస్తున్నప్పటికి, డొంకల దొరువు వైపు వెళ్ళిన సందర్భాలు చాలా తక్కువ. చిన్నవీ, పెద్దవీ అయిన మురికి కాలవల కడ్డంగా వేసిన ఒకటి రెండు తాటి దూలాలే అక్కడ వంతెనలుగా ఉపకరిస్తాయి. కొత్తవాళ్ళకు వాటిపైన నడవడం ప్రమాదంతో కూడిన పని. ఇరుకైన సందుగొందులు ఎలా వెళ్ళి, ఎక్కడ దిగబెడతాయో బోధపడదు. చిన్న పెంకుటింటి చుట్టూ పెద్ద ప్రహరీ గోడ కట్టుకోవడం వల్ల అక్కడ ఒక్కొక్క యిల్లూ చిన్నకోటలా వుంటుంది. జనంలో ఎక్కువభాగం బీదకార్మికులు. వాళ్ళ అవసరాలు చాలా తక్కువ. ఎప్పుడో అరుదుగా మాత్రమే వీధుల్లో కనిపిస్తారు. అందువల్ల అదొక నిషిద్ధ ప్రాంతంలా కానరావడంలో విడ్డూరం లేదు. మునిసిపాలిటి ఎన్నికల్లో కౌన్సిలర్ పదవికి పోటీ లేకుండా ఏకగ్రీవంగా అభ్యర్థి ఎన్నికయ్యే ఏకైక వార్డు డొంకలదొరువే! అట్లాగని అదంతా 'కౌన్సిలర్' పలుకుబడి అనుకోరాదు.

అక్కడ పూచిక పుల్లనైన నిలబెట్టి గెలిపించగల చొరవ సర్దార్జీ, అనే వ్యక్తికి చెందుతుంది. ఇతర వార్డుల్లో గూడా తన అభ్యర్థుల్ని నిలబెట్టి, వారి గెలుపుకోసం శతవిధాలా ప్రయత్నించి, ఎలాగైనా మునిసిపాలిటీ తన చేయిదాటి పోకుండా చూచుకుంటాడంటే ఈ సర్దార్జీ ఎంతటి ప్రజాశ్రేయోభిలాషో గ్రహించవచ్చు. విదేశీ రాయబారులు దేశంలో దిగగానే తమ మొదటి డ్యూటీగా రాష్ట్రపతిని కలుసుకుని, స్నేహసౌజన్యాలను వినిమియం చేసుకున్నట్టుగా, జిల్లాస్థాయి ఆఫీసర్లందరూ ఛార్జీ పుచ్చుకోగానే సర్దార్జీని సందర్శిస్తారట. కౌన్సిలర్లు మారొచ్చు, బేక్‌మన్ మారొచ్చు, యస్.పి.మారొచ్చు, జడ్జీ కూడా మారొచ్చు. కానీ సర్దార్జీ మాత్రం మారదు. సర్దార్జీకి మార్పులేదు. సర్దార్జీ స్థానం అచంచలం! సర్దార్జీ స్థానం శాశ్వతం!

ఈ శతాబ్ది ప్రథమ పాదంలో మల్లరవం పాళెగారు తన ముద్దుల ప్రేయసి ముసుగు నాగమ్మ కోసం నగరంలో కట్టించిన మేడ - ముసుగు నాగమ్మ మహిదీ- అన్న పేరుతో డొంకల దొరువులో ఉండిపోయింది. ముసుగు నాగమ్మను నాయకురాలు నాగమ్మలాంటి విశిష్ట వ్యక్తిగా చెప్పుకుంటారు. పాళెగారిని తన చేత కీలు బొమ్మగా ఉంచుకుని, సంస్థానాన్ని ఆమె తన కనుసన్నల్లో నడిపించిందనడానికి చాలా కథలు ప్రచారంలో వున్నాయి. కాలక్రమాన దీపం పెట్టే దిక్కుగూడా లేక, 'అనాథ'గా మారిపోయిన దశలో ముసుగునాగమ్మ మహిదీని, సంస్థానపు దూరపు వారసుడి ద్వారా సర్దార్జీ తండ్రి తన హక్కు భుక్తాల్లో పెట్టుకున్నాడట. సర్దార్జీ ప్రస్తుత నివాసం ఆ దేవిడీయే!

విరిగి పడిపోతుందేమోననిపించే ఆర్చి క్రిందనుంచి తటాలున ముందుకు దూరి నేను పొడుగాటి దేవిడీ మెట్ల ఎదుట నిల్చున్నాను. మెట్లపైన పులిజూద మాడుకుంటున్న వ్యక్తులు తలపైకెత్తి, ఎత్తిన తలను మెడపైన్నుంచి పైకి క్రిందికి ఆడిస్తూ, ఆ కదలిక ద్వారానే 'ఎవరివోయ్ నువ్వు' అని ప్రశ్నించారు.

సర్దార్జీ కోసం వచ్చినట్లు చెప్పుకున్నాను.

పేరు, అడ్రసు, వచ్చిన పనిలాంటి వివరాలన్నీ ఒక చిన్న కాగితంపైన యివ్వమన్నారు.

సమయానికి కలమూ, కాగితమూ జేబులో వుండడం గొప్ప సదుపాయమై పోయింది. రాసిన వేదన పత్రాన్ని వారిలో ఒకరి చేత పెట్టాను.

అతడు లోపలికి వెళ్ళి, అయిదు నిమిషాల్లో తిరిగొచ్చి "వెళ్ళొచ్చు" అన్నాడు.

మెట్లెక్కితే నేల మట్టానికి ఏడెనిమిది అడుగుల ఎత్తున ఒక వసారా. వసారాలోనుంచి నడవలోకి వెళ్తే దారికిటూ, అటూ కొన్ని గదులు. నడవదాటుకోగానే పెద్దహాలు. హాల్లో నాలుగు మూలాలాలోపలికి గుమ్మాలు. ఎదురుగా వున్న తూరుపు గోడ కానుకుని ఓ అరుగు. అరుగుపైన మూరెడెత్తు పరుపు. పరుపుమీద గోడ కానించి పెట్టినట్టుగా మద్దెలలాంటి దిండు. దానిపైన చేరగిలబడి సగం పడుకున్నట్టు, సగం కూచున్నట్టు చిద్విలానంగా కొలువైవున్న వ్యక్తిని సర్దార్జీగా పోల్చుకున్నాను. మల్లెపువ్వులాంటి తెల్లటి పైజామా, శరీరాన్ని గట్టిగా అంటి పెట్టుకున్న బనీనుపైన గ్లేజుకాగితంలాంటి గోధుమరంగు జుబ్బా, శిరస్త్రాణంలా పొట్టిగా కత్తిరించిన తలవెంట్రుకలు. వేళ్ళమధ్య కాలుతున్న సిగరెట్టు, కళ్ళల్లో ఎంతటి ఉత్పాతాన్నయినా సరకు చెయ్యని ఓ ఖాతరు లేనితనం వెరశీ ఈ దృశ్యానికంతా నిండుదనం చేకూరుస్తూ రకరకాల గడ్డాలతో, వైవిధ్య విలసితమైన మీసాలతో, వివిధాకారాల గిరజాలతో చిత్ర విచిత్ర వేషాలతో పదిపన్నెండు మంది వ్యక్తులు అతణ్ణి పరివేష్టించినట్టుగా నిలబడిపోయివున్నారు. కొన్ని కొన్ని ఆకారాలు, సన్నివేశాలు సినిమాల్లో మాత్రమే కనిపిస్తాయని అనుకునేవాణ్ణి. ఇప్పుడు వెళ్ళి ఎదుట నిలబడి పోయేసరికి జివ్వు జివ్వు మంటూ నరాల్లో ఏదో భయవీచిక పారాడసాగింది.

సర్దార్జీ ఒకసారి నావైపు ఎగాదిగా చూస్తూ పెదవి కదిపాడు.

"వెంకటేశ్వర్లంటే...."

"నేనేనండీ!" అంటూ చేతులు జోడించాను.

"ఇల్లు కట్టుకోడానికి పకీర్రాజు అడ్డు తగులుతున్నాడా?"

"అవునండీ!"

సర్దార్జీ సిగరెట్టు గట్టిగా ఒకసారి లోపలికి పీల్చి పొగవదలి పెడుతూ "ఒరే సాంబూ!" అన్నాడు.

"ఇక్కడ్నే వుంటినన్నా! సెప్పండి" అంటూ ముందు కొచ్చాడు సాంబు.

"వినోభాగనర్ ఎవరు చూస్తున్నారు?"

"అది పహిల్వాన్ పాపన్న జ్యూరిస్‌డిక్షన్ కిందికొస్తుందన్నా!"

"పాపన్నను పిలిపించి పకీర్రాజు పని పట్టమని చెప్పు" అంటూ ఫర్మానా జారీచేసి, సర్దార్జీ నావైపు తిరిగాడు "సరే, పకీర్రాజింక మీ జోలికి రాడు. వాడికి మా పాపన్న పుత్రం పెడ్తాడు. అందుకని పాపన్నకు మీరెంతిస్తారు?"

ఫెళ ఫెళమంటూ పిడుగొకటి నా తలపైన పడినట్టయింది. ఇలాంటి ప్రశ్న ఒకటి ఎదురౌతుందని నేనూహించలేదు. ఒకవేళ నేను తెంపు తెచ్చుకుని ఏదో ఒక సంఖ్యను చెప్పగలనే అనుకుందాం. అది సంతృప్తికరంగా లేకపోతే సర్దార్జీ నుంచి వెలువడే ప్రతిస్పందన ఎలా వుంటుందో తెలియదు. ఎరక్కపోయి వచ్చి యిక్కడ యిరుక్కున్నా నేమిట్రా బాబూ అని లోలోపల నేను కలవరపడిపోయాను.

"ఏమిటీ? ఆలోచించుకోవాలా?" అన్నాడు సర్దార్జీ.

టీచరు గదమాయింపుకు గజగజ వణికిపోతూ, బెత్తానికీ చివర నిల్చున్న స్కూలు కుర్రాడిలా నాలో నేను ఒదుగుళ్ళుపోతూ, "అవునండీ! పది నిమిషాలు గడువివ్వించండి" అంటూ ప్రాధేయపడిపోయాను.

"ఒరే సాంబూ! ఈయన్ను తీసుకెళ్ళి గదిలో కూచోబెట్టు" అని పురమాయించాడు సర్దార్జీ.

హాలుకు ఈశాన్య భాగంలో వున్న గదిలో నన్ను కూచోబెట్టి, సాంబు తన యథాస్థానానికి వెళ్ళిపోయాడు.

గదిలో సీలింగ్ ఫాన్ తిరుగుతున్నా ఊపిరాడని ఉమ్మదనంలో నేను ఉక్కిరి బిక్కిరై పోసాగాను. ఈ సారి సర్దార్జీ సముఖానికి వెళ్ళేటప్పటికీ నేనేదో ఒక సంఖ్య వెలిబుచ్చక తప్పదు. పదినిముషాల గడువైతే యిప్పించుకున్నాను గానీ, ఆ వ్యవధి గడవడమంతా ఎంతసేపు? వీధి గూండా పకీర్రాజు అయిదో పదో వాంఛిస్తున్నప్పుడు, అతణ్ణి ముగ్గులో నుంచి నెట్టివేయగల పాపన్న కంతకు తక్కువ రేటు నిర్ణయించడం ఏం బాగుంటుంది?

అదిగో.... అప్పుడే అయిదు నిమిషాలు గడిచిపోయాయి.

ఒక్కుమ్మడిగా పది పదిహేనుమంది లోపలికి చొచ్చుకొస్తున్నట్టుగా హాల్లోనుంచి కలకలం వినిపించింది. ముందుకు వంగి కిటికీ నుంచి అవతలికి చూచాను. అందరూ ఇరవైకు దరిదాపుల్లో కాలేజి స్టూడెంట్లకుమల్లే వున్నారు. పూలరంగళ్ళలా ముస్తాబైపోయి, లోకాన్నంతా వేలంపాటలో కొనేసేటంత ధీమాగా, వాళ్ళు రేసుగుర్రాల్లా హుమ్మస్సుపైన వున్నారు.

ఒక్క పెట్టున 'నమస్కారమన్నా, నమస్కారం' అంటూ అభివాదం చేశాక, వారిలో ఒకడు "కాలేజిలో ఎలక్షల్లొస్తున్నాయిగదన్నా! ఆ మాట చెప్పడానికని వచ్చినాం" అన్నాడు.

"చెప్పేదేముంది? మనోడి నెవరినైనా నిలబెట్టి గెలిపించిన తర్వాత గదా నా దగ్గరికి రావాలె!" అన్నాడు సర్దార్జీ.

"నిలబెడితిమన్నా! మన మనుబోలు చిన్నబ్బాయి కొడుకు వీరేశం లేడా, వీడే మనకాండిడేటు."

"మంచిదే గదా! పార్టీలు, మందులు, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, మైకులు అన్నీ జమాయిస్తిరి గదా?"

"దానికేంలోటు లేదన్నా! కానీ సుధాకర బాబని ఒకణ్ణి తెచ్చి, మన కాండిడేటుకు పోటీగా నిలబెట్టిరి. వాడు చానామంచోడంట! నోట్లో యేలు పెట్టినా కొరకడంట! ఈ స్టూడెంట్లకేం పోయేకాల మొచ్చిందో చానా మంది 'బాబుకే మా వోటు, బాబుకే మా వోటు, బాబుకే మా వోటు' అంటూ గొంతు చించుకుంటూ వుండిపోయిరి...."

"అట్లనా! ఎవడంట ఆ బోడి బాబు!"

"పేరున్నోడేం కాదన్నా! వాళ్ళనాయన చిన్న గవర్మెంటు నౌకరీలో వుంటాడంట!"

"ఒరే సాంబూ!" ఉరిమినట్టుగా పిలిచాడు సర్దార్జీ.

"చెప్పన్నా!"

"కాలేజిపైన మన పట్టుండి తీరాల!"

"అవుమరి! అంతే గదా!"

"బస్టాండు రాంబోగాణ్ణి పిలిపించి, ఇంక కాలేజికి వెళ్ళే పన్లేకుండా ఆ బాబుగాడికి కాలో, చెయ్యో విరిచేయమని చెప్పు...."

"అట్టనే అన్నా! మధ్యాహ్నం కేకేసుకొస్తా...."

తల దిమ్మెక్కి పోవడంవల్ల అంతకుమించి నాకేమీ వినిపించలేదు. ఒళ్ళు చల్లబడిపోయినట్టు తోస్తే రొమ్ము పైన చేయి వేసి చూసుకున్నాను. నీళ్ళలో మునిగి లేచినట్టుగా చొక్కా చెమటతో తడిసిపోయింది. ముఖం పైన మాత్రమే గాదు, కురుల కుదుళ్ళలో గూడా స్వేదబిందువులు పొటమరిస్తున్నాయి. భయంకర కుపిత వ్యాఘ్రమేదో తరుము కొచ్చినట్టుగా తలుపు తీసుకుని, నాలు గంగల్లో చివరకు వచ్చి నడవదారి గుండా బయటపడిపోయాను. పులిజూద మాడుకుంటున్న వస్తాదులు నా వాలకాన్ని ఒకింత ఆశ్చర్యంతో "ఏమిటి? ఏమైంది?" అని ప్రశ్నించారు. నాబుర్ర చురుగ్గా పనిచేసింది. "అయ్యా, నేను కాస్త జబ్బు మనిషిని! అయిదు నిమిషాల్లో ఒక మాత్ర వేసుకోవాలి" అంటూ గబగబా మెట్లు దిగేశాను.

*　　　*　　　*

'నగరంలో సగటు ఉద్యోగి స్వంత యిల్లు' గగనకుసుమంలా, కుందేటి కొమ్ములా, అత్తిపువ్వులా మాటల్లోనేగానీ, భౌతిక రూపంలో వుండదని చెబుతూ ఈ కథను ముగించవచ్చు. కానీ వివరణకోసం పట్టింపు చూసేవాళ్ళ కోసం మరి కొన్ని మాటలు చెప్పక తప్పదు. పునాదులు దాకా లేచిన నా యింటి జాగాను నేను అంగబలమూ, అర్థబలమూ గూడావున్న ఓ ఆసామికి తెగనమ్మి చేతులు దులి పేసుకున్నాను. పోగా, స్వంత యింటి గొడవతో అట్టే సంబంధం లేకపోయినప్పటికీ, ప్రయోగంలో బైత్రాదక్టులా బయటబడిన ఒక పరిణామాన్ని గురించి చెప్పడం యిక్కడ అప్రస్తుతం కాదనుకుంటాను. ముసుగు నాగమ్మ మహిదీకి వెళ్ళొచ్చిన మరునాటి నుంచి నేను మా అబ్బాయి సుధాకరబాబు చేత కాలేజి చదువుకు స్వస్తి చెప్పించాను. అంతగా చదువుకోవాలనివుంటే ప్రయివేటు కేండిడేటుగా పరీక్షకు హాజరవుతాడు. లేదు, చదువుకోకపోయినా పరవాలేదు. కాలూ చేయీ, ముఖమూ ముక్కు సజావుగా వుండడం ముఖ్యం. ఊపిరుంటే ఉప్పమ్ముకుంటాడు. బ్రతుకుదెరువు కోసం కాయకష్టం చేసుకోవలసి వచ్చినా తప్పేమీలేదు గదా!

♦ 'రచన' మాసపత్రిక, 1991 ♦